సాక్షి జోగులాంబ గద్వాల

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



జలాశయాలకు వరద

ఉమ్మడి జిల్లాలోని జూరాల, సుంకేసుల, శ్రీశైలం జలాశయాలకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది.

-10లో ▸



పోరాట యోధుడు.. సురవరం

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప పోరాట యోధుడు అని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు.

-10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.7 /22.9

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వరద బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

అలంపూర్: వరద బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి చర్యలు చేపట్టాలనిఎంపీ డీకే అరుణ కలెక్టర్‌ను కోరారు. ఆమెతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అలంపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు గొంగళ్ల ఈశ్వర్ సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2009 వచ్చిన వరదల్లో అలంపూర్‌కు చెందిన అనేక మంది ఇళ్లు, వాకిళ్లు, సర్వం కోల్పోయారన్నారు. బాధితుల కోసం 43 ఎకరాలు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చినా నేటికీ ఇవ్వలేదని, ఇప్పటికైనా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని వినతిలో కోరారు. వీరితోపాటు రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేంద్ర గౌడ్, నాయకులు రాజగోపాల్, భరత్ తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

గద్వాల: వ్యవసాయ యాంత్రీకరణ–2025లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు 50శాతం రాయితీతో వివిధ రకాల వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నట్లు డీఏఓ సక్రియానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు రూ.2.24 కోట్లు నిధులు మంజూరయ్యాయని, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులు, చిన్న, సన్నకారు రైతులు ఇందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుబుక్కులు, ట్రాక్టర్ ఆర్‌సీ, జిరాక్స్ పత్రాలను జతచేసి దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాకు కేటాయించిన పరికరాల్లో 1968 బ్యాటరీ స్ప్రేయర్లు, 396 పవర్ స్ప్రేయర్లు, 9 బండ్‌ఫార్మర్లు, 131 కేజీ వీల్‌తో కూడిన కల్టివేటర్లు, 103 రోటోవేటర్లు, 18 సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్లులు, 25 బ్రష్‌కట్టర్లు, 17 పవర్ టిల్లర్లు, 17 పవర్ వీడర్లు, 19 స్ట్రాబేలర్లు ఉన్నట్లు తెలిపారు.

'రెడ్‌క్రాస్' పాలక మండలి ప్రమాణస్వీకారం

గద్వాల: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా పాలక మండలి ఎన్నికలు సోమవారం నిర్వహించినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా సమాఖ్య భవన్‌లో ప్రమాణ స్వీకారం నిర్వహించినట్లు వివరించారు. సొసైటీ చైర్మన్‌గా సంగాల అయ్యపురెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా రమేష్, వైస్‌చైర్మన్ ఎండీ తాహిర్, ధనలక్ష్మి, ఖాజాంచీ, జిల్లా కార్యానిర్వాహక సభ్యులుగా కరాటే శ్రీహరి, ఎండీ అప్సర్‌పాష, చాగాపురం లక్ష్మీనారాయణ, పాల్ సుధాకర్, రవికుమార్, గంగాధర్‌గౌడ్, జయరామయ్య, మోహన్‌రావు, అక్బర్‌భాష, నల్లారెడ్డి ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లు



మహబూబ్‌నగర్ క్రైం/ అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామ సమీపంలో బుధవారం ఎస్‌జీడీ ఫార్మా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2వ యూనిట్ ప్రారంభ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్న సందర్భంగా ఎస్పీ జానకి సోమవారం హెలీప్యాడ్, సమావేశ స్థలాల దగ్గర నిర్వహించే బందోబస్తును పరిశీలించారు. వీఐపీల రాకపోకలతోపాటు పార్కింగ్ స్థలాలను తనిఖీ చేశారు. సీఎం పర్యటనకు అనుగుణంగా వీఐపీ రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్‌బీ రత్నం, ఆర్‌అండ్‌బీ అధికారి సంధ్య, భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఎస్‌బీ సీఐ వెంకటేష్, మూసాపేట ఎస్‌ఐ వేణు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి వెళ్తుండగా అపశ్రుతి

- హైవేపై ట్రాక్టర్‌ను ఢీకొన్న డీసీఎం



వివరాలు 10లో..



ఈ చిత్రంలోని మహిళ పేరు సుజాత. వడ్డేపల్లి మున్సిపాలిటీ నివాసి. కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈమెకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినట్లు జాబితాలో పేరు వచ్చింది. దీంతో ఉన్న చిన్నపాటి ఇంటిని కూల్చేసుకుంది. అనంతరం ఏమైందో ఏమో.. నీకు ఇళ్లు రాలేదని అధికారులు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడింది. ఇందిరమ్మ ఇళ్లు రాకపోగా ఉన్న ఇళ్లు కూలిపోవడంతో ప్రస్తుతం శాంతినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తుంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు లక్ష్మి. గట్టులో నివాసముంటూ కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. ఈమెకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినట్లు అర్హుల జాబితాలో పేరు వచ్చింది. దీంతో శిథిలావస్థకు చేరిన పాత ఇంటిని కూల్చి కొత్త ఇంటిని నిర్మించుకోవాలనుకుంది. అయితే రాజకీయ జోక్యంతో ఈమె పేరును లిస్టులో నుంచి తొలగించారు. ఎంత ఎదురుచూసినా ఇందిరమ్మ ఇళ్లు రాకపోవడంతో చిన్నపాటి రేకులతో కూడిన పాత ఇంటిలోనే కాలం వెళ్లదీస్తుంది. పై రెండు విషయాలను పరిశీలిస్తే జిల్లాలో రాజకీయ నాయకుల జోక్యం ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతుంది. గూడులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన నేతల మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి.

'గూడు' కల చెదిరింది !

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం



గట్టులో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో నుంచి పేరు తొలగించడంతో లబ్ధిదారురాలు లక్ష్మి ఏర్పాటుచేసుకొని జీవనం సాగిస్తున్న రేకుల షెడ్డు ఇదే..

- అర్ధాంతరంగా లిస్టులో నుంచి పేర్ల తొలగింపు
- మరికొందరు ఇంటి పనులు ప్రారంభించిన అనంతరం లిస్టులో మార్పులు
- దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు
- జిల్లాలో నత్తనడకన సాగుతున్న ఇళ్ల నిర్మాణం

గద్వాల: తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని.. ఇక తమ గూడు కష్టాలు తీరనున్నాయని ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న జిల్లాలోని లబ్ధిదారుల గంపెడాశలపై కొందరు రాజకీయ నాయకులు నీళ్లు చల్లుతున్నారు. అటు ఉన్న ఇంటిని కూల్చేసుకొని.. ఇటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాక అద్దె ఇళ్లలో ఉండే పరిస్థితి దాపురించింది. జిల్లాలోని అలంపూర్, గద్వాల నియోజకవర్గాలకు చెరి 3,500 చొప్పున మొత్తం 7000 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 6,815 లబ్ధిదారులను గుర్తించగా.. ఇందులో 816 ఇండ్లు వివిధ నిర్మాణ దశలో కొనసాగుతున్నాయి.

ఎంపికలో రాజకీయమే

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో రాజకీయం చోటుచేసుకుందని, నేతలు సిఫారసు చేసిన అనర్హులకు ఇళ్లు మంజూరీ చేశారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా కొన్ని చోట్ల ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు ఎంపిక చేయటానికి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో డబ్బులు వసూలు చేస్తున్నారని కలెక్టర్ బీఎం సంతోష్ సమక్షంలోనే కొందరు బాహటంగానే ఆరోపణలు చేయడం తీవ్ర కలకలం రేపింది. ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.30–50వేల వరకు వసూలు చేస్తున్నారని బాహటంగానే చెబుతున్నారంటే ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందో స్పష్టమవుతుంది.

విచారించి చర్యలు

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియలో నిబంధనలు పాటిస్తూ అర్హులైన వారిని ఎంపిక చేయాలని అధికారులకు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చాం. మీరు చెబుతున్నట్లు ఎక్కడైన అనర్హులు ఎంపిక చేసినా.. డబ్బులు వసూలు చేసినట్లు ఎవరైన ఫిర్యాదు చేసినా వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– వి.లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్

నిబంధనలు బేఖాతరు

కుల, మత, రాజకీయాలకు అతీతంగా నిజమైన పేదలను ఎంపిక చేసి వారికి ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఈక్రమంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలతో దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులను ఎంపిక చేయడంలో ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. ఇందులో లబ్ధిదారునికి ఎలాంటి సొంత ఇళ్లు, 5ఎకరాలకు మించి పొలం, నాలుగు చక్రాల వాహనం ఉండరాదు, వంటి నిబంధనలు విధించింది. అయితే జిల్లాలో అర్హుల ఎంపికలో నిబంధనలను కొందరు గాలికి వదిలేశారు. అనర్హులకు పెద్దపీట వేస్తూ అర్హులకు మొండిచెయ్యి చూపారనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

పర్సంటేజీలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఏది..?



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

అధికార పార్టీ నేతలపై మండిపడ్డ ఎంపీ డీకే అరుణ

గద్వాలటౌన్: పార్టీలు మారడం, పర్సంటేజీలు తీసుకోవడం తప్ప, అభివృద్ధిపై పాలకులకు ధ్యాస లేదని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ధ్వజమెత్తారు. గద్వాల అభివృద్ధిలో పాలకులు విఫలమయ్యారని ఆరోపిస్తూ.. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముందుగా ఆ పార్టీ నాయకులు మోటార్ బైక్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. ఇక్కడున్న ప్రజాప్రతినిధికి పార్టీ కండువాలు మార్చడం మీదున్న శ్రద్ధ అభివృద్ధిపై కొరవడిందని మండిపడ్డారు. ఆయన ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో ఎవరకీ అర్థం కావడం లేదని, అలాంటి వ్యక్తి గద్వాలలో ఉండటం దురదృష్టకరమన్నారు. విద్వత్ గద్వాలను వివాదాల గద్వాలగా మార్చిన చరిత్ర ఆయనకే దక్కుతుందన్నారు. అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెప్పుకునే వ్యక్తి.. ఏడాదిన్నరలో ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. తుమ్మిళ్ల, నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల, ఆర్డీఎస్ పథకాలు ఇంకా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. ర్యాలంపాడు, జూరాల ప్రాజెక్టు లీకేజీల సమస్యను ఎందుకు సరిచేయలేదని నిలదీశారు. గద్వాలలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వేసిన రోడ్లే తప్ప మరోకటి కనిపించడం లేదని విమర్శించారు. ఏ పనిలో ఎంత దోచుకుందాం అనే యావలోనే ఇక్కడి నేతలు ఉన్నారని ఆరోపించారు.

ప్రజలకు అందుబాటులో కోర్టు నిర్మాణాలు..

అనంతపురం గుట్టలలో కోర్టు భవన సముదాయాలను నిర్మించాలని పాలకులు ప్రయత్నించడం వారి అసమర్థపాలనకు నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ భూమి సిద్ధాంతచారి కుంటను కబ్జా చేసుకోవడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారని, ఆ భూమిని కోర్టు సముదాయానికి అప్పగిస్తే అందరికి ఆమోద యోగ్యంగా ఉంటుందన్నారు. పాలకుల బీనామీలకు, రియల్టర్లకు ప్రయోజనం చేకూర్చడానికి కాకుండా ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్థలం కేటాయించాలని కోరారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ నీతి మాలిన రాజకీయాలు చేస్తుందని ధ్వజమెత్తారు. అనంతరం కలెక్టర్ సంతోష్‌తో సమావేశమై గద్వాల అభివృద్ధి, నూతన కోర్టు భవనాల స్థలం కేటాయింపుపై చర్చించి, వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తూళ్ల వీరేంద్రగౌడ్, రామంజనేయులు, డీకే స్నిగ్ధారెడ్డి, రామచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, రమాదేవి, కృష్ణవేణి, బండల పద్మావతి, రాజగోపాల్, శివారెడ్డి, సమత, శోభరాణి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణంరాజు, రఘుగౌడ్, బండల పాండు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 48 ఫిర్యాదులు అందగా.. వాటిని ఆయా శాఖల అధికారులకు బదిలీ చేశారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కానిపక్షంలో అందుకు గల కారణాలు వివరిస్తూ సంబంధిత ఫిర్యాదుదారుడికి అక్‌నాలెడ్జ్‌మెంట్ ద్వారా తెలియజేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీ నారాయణ, నర్సింగ్‌రావు కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 10 అర్జీలు

గద్వాల క్రైం: సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌లో వివిధ గ్రామాలకు చెందిన బాధితులు ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదులు చేశారు. ప్రధానంగా భూ వివాదం, ఆస్తి తగదాలు, అప్పుగా తీసుకున్న వ్యక్తులు డబ్బులు చెల్లించడం లేదంటూ మొత్తం 10 మంది ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చేకూరుస్తామని బాధితులకు వివరించారు. సివిల్ సమస్యలపై కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాలన్నారు.

కదంతొక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయులు

ఓపీఎస్ అమలు కోరుతూ ర్యాలీ, ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

గద్వాలటౌన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానం పేరిట అమలవుతున్న నూతన పింఛన్ విధానంతో కనీస పింఛన్ కూడా పొందలేమని, ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని, తమకు న్యాయం చేయాలంటూ ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహించారు. జేఏసీ నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పింఛన్ ఉద్యోగుల హక్కు అంటూ నినదించారు. ప్లకార్డులు చేతబట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. సీపీఎస్ వద్దు – ఓపీఎస్ ముద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులు సైతం పెద్ద ఎత్తున ఆందోళనకు తరలివచ్చారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు.

అది మన హక్కు..

ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ నాగర్జునగౌడ్, కోచైర్మన్లు నర్సింహారెడ్డి, విష్ణు, టీఎన్‌జీఓ రాష్ట్ర కార్యదర్శి బీమన్న, సీపీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు గోపాల్, బీకే వెంకటేష్, యూనుస్‌పాష, లక్ష్మన్న, బుచ్చన్న మాట్లాడారు. 2004 తర్వాత ఉద్యోగాలు పొందిన వారందరికీ పెన్షన్ రద్దు చేయడం దారుణమన్నారు. పెన్షన్ భిక్ష కాదని.. మన హక్కు అన్నారు. రాష్ట్రంలో సుమారు రెండు లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాల భద్రత అగమ్యగోచరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో చనిపోయిన, రిటైరైన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలు గ్రాట్యుటీ, పీఎఫ్ లేక పెన్షన్ అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ సంతోష్‌కు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శేఖర్‌రెడ్డి, ఆనంద్, ఖాజామీర్, రమేష్, లోకరాజు, రాధకృష్ణరెడ్డి, కృష్ణ, నర్సింహులు, రవికుమార్, తిమ్మప్ప, ప్రభాకర్‌శాస్త్రి, సుజాత, అశోక్ పాల్గొన్నారు.

బీసీ బిల్లు చారిత్రాత్మక విజయం



సీఎం చిత్రపటానికి పాలతో అభిషేకిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

అలంపూర్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అసెంబ్లీలో ఆమోదం పొందడం కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రాత్మక విజయమని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని జాతీయరహదారి ఫ్లెక్టోవర్ కూడలిలో అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం సంబరాలు జరుపుకొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ చిత్రపటానికి పాలతో అభిషేకించి బాణసంచా పేల్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనార్టీలు ఎంత మంది అనే ప్రతిపాదికతన రిజర్వేషన్లు కల్పించడానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. బీసీలోని బడుగు బలహీన వర్గాలకు ఈ రిజర్వేషన్లు అపూర్వ అవకాశం అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జెడ్పీచైర్మన్‌లు, అలంపూర్, వడ్డేపల్లి, అయిజ మున్సిపాలిటిలో కౌన్సిలర్లకు 42 శాతం బీసీలకు రిజర్వేషన్‌లు లభించే అవకాశం ఉందన్నారు. ఇటీవల ఎస్సీలకు ఏబీసీడీ వర్గీకరణ చేసి 35 ఏళ్ల వారి కలను సీఎం సాకారం చేశారని, గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాస్, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మద్దిలేటి, నాయకులు షేక్షావలి ఆచారి, గోపాల్, వెంకట్ గౌడ్, రమణ, శ్రీకాంత్, కృష్ణయ్య, జగన్‌మోహన్ నాయుడు తదితరులు ఉన్నారు.

రైతు ఆగమాగం

అధిక వర్షాలకు దెబ్బతింటున్న పంటలు

- కంది, వేరుశనగతోపాటు ప్రధాన పంటలకు తెగుళ్ల ముప్పు
- నష్ట పరిహారంపైనే ఆశలు



అయిజ శివారులో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

అయిజ: రోజుల తరబడి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలతో భూమిలో తేమ శాతం ఎక్కువై ఆయా పంటలకు వేరుకుళ్లు రావడంతో మొక్కలు బలహీనపడుతున్నాయి. అదేవిధంగా తెగుళ్లు, పురుగులు ఆశించి పంటలను దెబ్బతీస్తున్నాయి. దీనివలన రైతన్నలు అపారంగా నష్టపోతున్నారు. ఒక్క అయిజ మండలంలో సుమారు 59 వేల ఎకరాలు పంట భూములున్నాయి. వానాకాలం సాగులో భాగంగా సుమారు 40 వేల ఎకరాలలో అన్నదాతలు వివిధ పంటలు సాగు చేసారు. ముఖ్యంగా పత్తి, విత్తనపత్తి, కంది, మిరుప, వేరుశనుగ పంటలు సాగుచేయగా కొందరు రైతులు బొప్పాయి పంటను సాగుచేశారు.

పంటలపై తీవ్ర ప్రభావం

దాదాపు 20 రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రధాన పంటలన్ని దెబ్బతిన్నాయి. ముఖ్యంగా పత్తి పంటకు వేరుకుళ్ల తెగులు ఆశించింది. పూత, కాయదశలో ఉన్న పత్తి పంట దెబ్బతింది. భూమిలో తేమశాతం ఎక్కువై పూత పూయడంలేదు. పిందెలు, కాయలు రాలిపోతున్నాయి. పురుగు ఉధృతి అధికమవుతోంది. మందులు పిచికారీ చేసిన కొద్దిసేపటికే మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో మార్పు కానరావడంలేదు. తెగుళ్లు అంతకంతకూ విస్తరిస్తున్నాయి. కంది పంటకు ఎక్కువగా వేరుకుళ్ల తెగులు ఆశించింది. ఉల్లి గడ్డలు పంట పొలంలోనే మురిగిపోతుండగా.. వేరుశనుగ కాయలు పొలాల్లోనే మొలకలు వస్తున్నాయి. రైతులు సాగు చేసిన బొప్పాయి పంటకు వైరస్ ఆశించి మొక్కలు తెలుపురంగులోకి మారాయి. ఎదుగుదల లేక గిడసబారాయి.

పంట నష్టపరిహారం అందించాలి



అధిక వర్షాలకు పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. దిగుబడి కూడా ఘన నీయంగా పడిపోయే అవకాశం ఉంది. పంటల సాగుకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ. 50 వేలవరకు ఖర్చుచేశారు. పత్తి, మిరుప, వేరుశనుగ పంటలు పూర్తిగా తెబ్బతిన్నాయి. ఇప్పుడు వర్షాలు కురవకపోయినా పంటలు కోలుకునే పరిస్థితిలో లేవు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి.

– జగన్నాథరెడ్డి, రైతు, అయిజ

దిక్కుతోచడంలేదు..



రైతులు సాగుచేసిన పంటలన్ని భారీ వర్షాలకు ఆగమయ్యాయి. కనీసం సస్యరక్షణ చర్యలు చేపడదాం అనుకున్నా వర్షాలు ఆగడంలేదు. ఏ పంట కూడా ఆరోగ్యంగా లేదు. అతి వర్షాలతో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారు. ఎన్ని మందులు పిచికారి చేసినా లాభం లేకుండా పోతోంది. రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– లింగన్న, రైతు, అయిజ

క్లుప్తంగా

యోగాసనాలలో ఏఎస్‌ఐ వనజ ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రైం: తెలంగాణ యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో అదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి సీనియర్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్–2025 ట్విస్టింగ్ బాడీ– ఫార్వర్డ్ బెండింగ్ ఈవెంట్‌లో ఏఎస్‌ఐ వనజ ప్రతిభచాటారు. మొదటి స్థానంలో నిలిచిన ఆమెను సోమవారం ఎస్పీ డి.జానకి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సేవలతోపాటు క్రీడా రంగంలో కూడా ప్రతిభ కనబరచడం గర్వకారణం అన్నారు. ప్రతిభావంతులైన సిబ్బందికి పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని భవిష్యత్‌లో ఇంకా మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.


65 మంది సీసీల బదిలీ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): డీఆర్‌డీఓ శాఖ సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న 65 మంది సీసీలను బదిలీ చేశారు. సోమవారం డీఆర్‌డీఓ నర్సింహులు వారికి కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్‌లను కేటాయించారు. ఇందులో క్లస్టర్ల పరిధిలో కౌన్సెలింగ్ ద్వారా వారు కోరుకున్న స్థానాలకు బదిలీ చేసినట్లు తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం ఆయా స్థానాల్లో జాయిన్ కావాలని డీఆర్‌డీఓ సూచించారు.

భూ నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలి



కోడేరు: పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన తీగలపల్లి గ్రామ భూ నిర్వాసితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. సోమవారం కోడేరు మండలం తీగలపల్లిలో భూ నిర్వాసితులు నష్టపరిహారం చెల్లించాలని నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దాదాపు 70మంది రైతులు పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరిగినా అధికారులు స్పందించడం లేదన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.60 లక్షలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ, భూ నిర్వాసితులు ఆంజనేయులు, వెంకటయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.






ఆకాశం.. 'వర్ణ'నాతీతం

అప్పటి దాకా నీలివర్ణంలో ప్రశాంతంగా కనిపించిన ఆకాశం ఒక్కసారిగా ఎరుపు, పసుపు రంగుల్లోకి మారి చూపరులను కట్టిపడేసింది. సోమవారం సాయం సంధ్య వేళలో భానుడు వివిధ వర్ణాలతో మెరిసిపోతూ ఆకట్టుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో సాయంత్రం 6.45 నుంచి 7.20 గంటల ప్రాంతంలో వర్ణనాతీతంగా కనిపించిన ఆకాశాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి, సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

గొప్ప పోరాట యోధుడు.. సురవరం



మాట్లాడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి భార్య విజయలక్ష్మి, చిత్రంలో చాడ వెంకట్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సంపత్‌కుమార్

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- ఆయన ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి : మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్
- సురవరం సుధాకర్‌రెడ్డి స్వగ్రామం కంచుపాడులో సంస్మరణ సభ
- నివాళులర్పించిన వలు పార్టీల నాయకులు

ఉండవెల్లి: గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించి, నింగికెగిసిన నిస్పృహుడు, తెలంగాణ పోరాట యోధుడు సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి అని ఆ పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉండవెల్లి మండలం కంచుపాడు గ్రామంలోని సురవరం వెంకట్రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను ఉమ్మడి జిల్లా సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాడా వెంకట్‌రెడ్డితో పాటు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సంపత్ కుమార్, అబ్రహం తదితరులు హాజరయ్యారు. ముందుగా సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి జన్మభూమిని, కన్నతల్లిని మరువలేదని, సొంత గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయిలో సామాన్యుడి సమస్యలపై గళం విప్పాడని కొనియాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో.. దేశానికి ప్రమాదం పొంచి ఉందని, మతోన్మాద, నియంతృత్వ పాలన సాగిస్తారని ముందే హెచ్చరించారని, అలాగే జరిగిందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి, పోరాటానికి వామపక్షాలు ఒకే వేదిక మీదికి రావాలన్నారు.

ఆయన పేరు చరిత్రలో నిలిచేలా చేస్తాం : సంపత్‌కుమార్

సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆయన పేరును చరిత్రలో నిలిచేలా చేస్తామని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సంస్మరణసభలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కంచుపాడులోని పలు సమస్యలను సురవరం సుధాకర్‌రెడ్డి భార్య విజయలక్ష్మి తీసుకురాగా 24 గంటల్లో ఆయా పనులు మంజూరు చేశారన్నారు. గ్రామంలోని యూపీఎస్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తామని, రూ.కోటితో భవనం, హాస్టల్ నిర్మిస్తామని అన్నారు. సురవరం ఆశయ సాధన కోసం కృషిచేస్తున్న ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, జాతీయ రహదారి నుంచి కంచుపాడుకు బీటీరోడ్డుకు రూ.3 కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను ఈసందర్భంగా విజయలక్ష్మికి అందజేశారు.

ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి.. : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పార్టీలు పక్కన పెట్టి ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి జాతీయ స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడి కంచుపాడు కామ్రేడ్‌గా శాశ్వతంగా మనలో ఉంటాడని అన్నారు. అనంతరం సురవరం భార్య విజయలక్ష్మి మాట్లాడుతూ సొంత గ్రామానికి ఏదో ఒకటి చేయాలని ఆయన నిత్యం తలచారని, డిగ్రీ కళాశాల, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడానికి సొంత పొలాన్ని అందజేస్తామని, ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. సురవరం విజ్ఞాన కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. రాజకీయంగా కాకుండా మంచి గురువుగా, ఉమ్మడి జిల్లాలో మా తండ్రి నుంచి పరిచయమైన గొప్ప వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్రహం సైతం నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రేమ్ పావని, సురవరం సోదరి సరోజ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, కుమారులు కపిల్, సీపీఐ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి వెళ్తుండగా అపశ్రుతి



ప్రమాదానికి గురైన ట్రాక్టర్



ప్రమాదానికి కారణమైన డీసీఎం

- హైవేపై ట్రాక్టర్‌ను ఢీకొన్న డీసీఎం
- ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం

ఎర్రవల్లి: వినాయకుడి నిమజ్జనానికి వెళ్తున్న ట్రాక్టర్‌ను డీసీఎం వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. అలాగే మరొకరి పరిస్థితి విషమంగా ఉండగా.. ఆరుగురికి గాయాలైన సంఘటన మండలంలోని కొట్టం కాలేజీ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఇటిక్యాల ఎస్‌ఐ రవినాయక్ కథనం ప్రకారం .. ఇటిక్యాలకు చెందిన బోయ జమ్మన్న(50), బోయ నర్సింహులు(48), అదే గ్రామానికి చెందిన మరో ఏడు మందితో కలిసి చెన్నకేశవస్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన వినాయకుడిని బీచుపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు ఆదివారం రాత్రి ట్రాక్టర్‌లో బయలుదేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై అర్ధరాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో కొట్టం కాలేజీ సమీపంలో వెళ్తుండగా కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పల్టీలు కొట్టి రోడ్డు కిందకు దూసుకుపోవడంతో వినాయకుడితోపాటు అందులో ఉన్న వారంతా చెల్లాచెదురుగా పడిపోయారు. ప్రమాదంలో తీవ్ర రక్త గాయాలు కావడంతో బోయ జమ్మన్న అక్కడికక్కడే మృతిచెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి బోయ నర్సింహులు మృత్యువాత పడ్డారు. అలాగే ప్రమాదంలో గాయాలపాలైన జ్ఞానేశ్వర్, నరేందర్, మహేందర్, రమేష్, రాముడు, యశ్వంత్, మధులను అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో నరేందర్ తలకు తీవ్ర రక్త గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై జమ్మన్న భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వినాయకుడి నిమజ్జనోత్సవంలో అపశ్రుతి చోటు చేసుకొని ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



జమ్మన్న (ఫైల్)



నర్సింహులు (ఫైల్)

మెడికల్ కళాశాలకు నేత్రాల అప్పగింత

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నర్సింహులు నేత్రాలను కుటుంబ సభ్యులు కర్నూలు మెడికల్ కళాశాలకు అందజేశారు. నర్సింహులు భార్య లక్ష్మి, కుమారుడు నవీన్, కుమార్తె పూజిత తమ కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్నా దుఃఖాన్ని దిగమింగుకొని మరో వ్యక్తి జీవితంలో వెలుగులు నింపడం కోసం మృతుని నేత్రాలను దానం చేసి మానవత్వం చాటుకున్నారు.

పీయూలో సిబ్బందికి క్రీడా పోటీలు



షెటిల్ ఆడుతున్న వీసీ శ్రీనివాస్, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్

పాల్గొన్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూర్ యూనివర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు పాల్గొని షెటిల్ ఆడారు. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ రోజువారీ బిజీ జీవితంలో సిబ్బంది ఆఫీస్ పనుల్లో ఉండి క్రీడలు, శారీరక శ్రమ దూరంగా ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో ఈ పోటీలను నిర్వహించడం వల్ల సిబ్బంది ఆరోగ్యం, మానసికంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎవరైతే ప్రతిరోజు ఆటలు, కీడల్లో పాల్గొంటారో వీరి జీవిత కాలం పొడిగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, రవికాంత్, అర్జున్‌కుమార్, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సస్పెండ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని మహమ్మదాబాద్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శివలీలను సస్పెండ్ చేస్తూ డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. శివలీలను గండేడ్ మోడల్ స్కూల్‌కు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించాలని డీఈఓ గతంలో ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆమె మోడల్ స్కూల్‌లో రిపోర్టు చేయకపోగా బాధ్యతలు సైతం తీసుకోలేదు. దీంతో పలుమార్లు డీఈఓ పిలిచి బాధ్యతలు తీసుకోవాలని, వెంటనే ఆగస్టు నెల బిల్లులు చేయాలని ఆదేశించినా పట్టించుకోలేదు. దీంతో మోడల్ స్కూల్ సిబ్బందికి సంబంధించి ఆగస్టు నెల వేతనాలు, బిల్లులు కాలేదని తెలుస్తుంది. ఈ విషయమై డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా శివలీలకు మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించగా పట్టించుకోకపోవడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

- జోగుళాంబ జోన్– 7 డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్



పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ చౌహాన్

వనపర్తి: పోలీసులు ఎల్లవేళలా స్టేషన్లలో అందుబాటులో ఉండి బాధితులకు రక్షణగా ఉండాలని జోగుళాంబ జోన్– 7 డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఆయన జిల్లాలోని పెబ్బేరు, చిన్నంబావి, పెద్దమందడి పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. అంతకముందు ఎస్పీ రావుల గిరిధర్ పుష్పగుచ్ఛం అందించి డీఐజీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. ఎక్కువగా జరిగే నేరాలు, వాటి ప్రాంతాలు, కేసుల నమోదు వివరాలు, నేరస్తుల ప్రస్తుత పరిస్థితుల గురించి ఆయా స్టేషన్ల ఎస్‌ఐలతో ఆరా తీశారు. గ్రామాల్లో, పట్టణాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతి పోలీసు నిబద్ధతతో ఉండాలని, తమకు కేటాయించిన విధిని సక్రమంగా నిర్వహించినప్పుడే అధికారులు, ప్రజల నుంచి మన్ననలు పొందుతారని, చేసిన పనికి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐలు కృష్ణయ్య, రాంబాబు, ఎస్‌ఐలు యుగంధర్ రెడ్డి, జగన్, శివకుమార్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

జలాశయాలకు నిలకడగా వరద

- జూరాలకు 1,56,615 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 20 గేట్లు ఎత్తి దిగువకు 1,70,534 క్యూసెక్కులు
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



శ్రీశైలంలో పదిగేట్ల ద్వారా సాగర్‌కు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

ధరూరు/ఆత్మకూర్/మదనాపురం/దేవరకద్ర/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పడుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 2లక్షల 14వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం సాయంత్రం 7:30 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో లక్షా 56వేల 615 క్యూసెక్కులకు తగ్గినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు 20 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా లక్షా 36వేల 240 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుద్పత్తి నిమిత్తం 32వేల 171 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాలువకు 386 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం లక్షా 70వేల 534 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9,657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8,048 టీఎంసీల నిల్వ ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలం నుంచి సాగర్‌కు పరుగులు

ఎగువ ప్రాంతాల నుంచి నీటిప్రవాహం కొనసాగుతుండడంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద ఎత్తి ఉంచిన పది గేట్లు సోమవారం కొనసాగుతున్నాయి. జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,36,240, విద్యుదుత్పత్తికి 32,171, సుంకేసుల నుంచి 66,752 మొత్తం 2,35,163 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. శ్రీశైలంలో ఆనకట్ట పదిగేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2,67,440 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,288 మొత్తం 65,603 క్యూసెక్కులను అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగుల నీటి మట్టం వద్ద 199.7354 టీఎంసీల నిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 27,000, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,489 క్యూసెక్కులను విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.765 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.215 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

పూర్తిస్థాయి నీటిమట్టానికి రామన్‌పాడు

రామన్‌పాడు జలాశయంలో సోమవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 390 క్యూసెక్కులను వదులుతూ సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 925 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 55 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఊకచెట్టు వాగు, సరళాసాగర్ ద్వారా వరద వస్తుండడంతో ఒక గేటు ఎత్తి 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

కోయిల్‌సాగర్ గేట్ల బంద్

కోయిల్‌సాగర్ గేట్లను సోమవారం ఉదయం నుంచి మూసి వేశారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గి పోవడంతో ఆదివారం తెరిచిన ఒక గేటును మూసి వేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు ఉండగా ప్రస్తుతం 32అడుగులుగా ఉంది. నీటి సామర్థ్యం 2.27 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.2 టీఎంసీల నిల్వ ఉంది.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి



జూరాల నుంచి 20 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వర నీరు

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలవిద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా ఈ ఏడాది రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి పరుగులు పెడుతుంది. జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రారంభమైనప్పటి నుంచి మే నెలలోనే విద్యుదుత్పత్తి ప్రారంభించి రికార్డు సృష్టించారు. ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి 565 మిలియన్ యూనిట్లను సాధించారు. కాగా, ఈ ఏడాది 2025–26 సంవత్సరానికిగాను 610 ఎంయూ టార్గెట్ ఉంది. ఎగువ కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు భారీస్థాయిలో కురుస్తుండడంతో నారాయణపూర్, ఆల్మట్టి ప్రాజెక్టుల నుంచి జూరాలకు వరదనీరు చేరుతుండడంతో విద్యుదుత్పత్తి లక్ష్యానికి చేరువలో ఉంది. సోమవారం 12 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఎగువలో 6యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 269.017 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 296.310 ఎంయూ ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు.

అతివేగమే ప్రమాదానికి కారణమా..?

ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిన ట్రావెల్ బస్సు

మహబూబ్‌నగర్ క్రైం/అడ్డాకుల: అడ్డాకుల మండల సమీపంలోని కాటవరం స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. అయితే ట్రెయిలర్ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో బస్సును డ్రైవర్ అతివేగంగా నడపడమే కారణంగా తెలుస్తోంది. ప్రమాదం ప్రయాణికులు ఎక్కించే డోర్ వైపు జరగడం వల్ల డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. బస్సు ముందు వరుస భాగంలో కూర్చున్న వారికే ఎక్కువ నష్టం జరిగింది. లారీ వెనుక బస్సు ఢీకొట్టిన సమయంలో బస్సు లెఫ్ట్ సైడ్ ఎక్కువ భాగం లోపలి వరకు దెబ్బతింది. దీంతో పాటు చాలా వరకు లారీలను రాత్రివేళ దాబాల వద్ద నిలుపుతుంటారు. అయితే ప్రమాద స్థలం వద్ద కూడా దాబా హోటల్ ఉండటంతో లారీని ఇక్కడ నిలిపేందుకు డ్రైవర్ దాన్ని స్లో చేసి ఉంటాడనే అనుమానం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే వేగంగా వచ్చిన బస్సు అదుపు తప్పి లారీని ఢీకొట్టి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.



వివరాలు సేకరిస్తున్న అడ్డాకుల పోలీసులు

మధ్య తరగతి కుటుంబాలే..

ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిలో హసన్ పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఇతడి మృతితో పిల్లలు అనాథలుగా మారారు. నంద్యాలకు చెందిన అఫ్రాప్ ఉన్నీసా హైదరాబాద్‌లోని హఫీజ్ పేట్‌లో ఉండే కొడుకు ఫిరోజ్ భాష దగ్గరి నుంచి నంద్యాలకు వెళ్తూ మృతి చెందింది. నంద్యాలకు చెందిన సుబ్బరాయుడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇక ఎల్లమ్మ హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో దినసరి కూలీగా పనిచేస్తూ కొడుకును చదివిస్తోంది. ఆమె కుమారుడు పదేళ్ల సంతోష్ నాలుగో తరగతి చదువుతుండగా.. ఇటీవల తండ్రి కూడా చనిపోవడంతో అనాథగా మారాడు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

గద్వాల క్రైం: మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన వెంకటేష్ (25) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గత కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యులకు చూయించినప్పటికీ ఫలితం లేకపోయింది. అయితే గత నెల 17న ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకటేష్ తిరిగిరాలేదు. దీంతో యువకుడి తండ్రి మల్దకల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం గద్వాల మండలం పరుమాలలో చెట్టుకు యువకుడు ఉరేసుకున్నట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడు వెంకటేష్‌గా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు.